
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.6; కనిష్ఠం 28.8



నిర్మల్
జిల్లా వార్తలు
8
శనివారం 20 ఏప్రిల్ 2024

కాంగ్రెస్‌లో చేరికల



- జిల్లాలో వరుస చేరికలతో పార్టీలో కొత్త ఉత్సాహం
- నీరసిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ
- ఐకేరెడ్డి ముఖ్య అనుచరుల చేరికలతో కారు డీలా

నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాజకీయాలు రోజు రోజుకు అనూహ్యంగా మారుతున్నాయి. నాలుగు నెలల క్రితం వరకు ఓ వెలుగు వెలిసిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం పూర్తిగా డీలా పడుతోంది. ఆ పార్టీకి చెందిన ముఖ్యనేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తుండడం, మరోవైపు ఆయన సన్నిహిత అనుచరులంతా క్యూ కడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్న కారణంగా బీఆర్‌ఎస్ పార్టీ రోజు రోజుకూ నీరసించిపోతోంది. అయితే ముఖ్యంగా నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు సాధారణ కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌లో చేరుతుండడం ఆ పార్టీలో కొత్త ఉత్సాహానికి కారణమవుతోంది. కాగా ఈ చేరికల్లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహిత నేతలు సైతం ఉంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై ఇప్పటి వరకు అధిష్ఠానం నుంచి ఎలాంటి స్పందన కనిపించకపోతుండడం అలాగే ఆయన కొద్దిరోజులు వేచి చూడాలంటూ కేడర్‌కు సూచిస్తుండడం లాంటి పరిణామాలు భిన్నరకాల వాదనలకు ఊతమిస్తున్నాయంటున్నారు. దీని కారణంగా ఇంద్రకరణ్‌రెడ్డి సైతం కొద్దిరోజుల నుంచి మౌనంగా ఉంటూ రెండు రోజుల క్రితం మాత్రం మరోసారి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. అయితే ఈ సమయంలో కూడా ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే వ్యవహారంపై స్పష్టతనివ్వకపోతుండడం ఆ పార్టీ శ్రేణుల్లో అనుమానాలకు తావిచ్చింది. దీని కారణంగానే ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహితులైన దిలావర్‌పూర్ మండలానికి చెందిన పలువురు సీనియర్ నేతలు గురువారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును కలిసి పార్టీలో చేరే అంశంపై చర్చించారు. నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అలాగే సీనియర్ నాయకులు కోడే రాజేశ్వర్‌లతో పాటు చాలా మంది నాయకులు శ్రీహరిరావుతో కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై మంతనాలు జరిపారు. వారంతా శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరబోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు ఇప్పటికే నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో పాటు 20 మంది కౌన్సిలర్‌లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరంతా ఐకేరెడ్డికి మొన్నటి వరకు అత్యంత సన్నిహితులుగా కొనసాగిన వారే కావడం చర్చకు తావిస్తోంది. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి మౌనంగా ఉంటుండడం అలాగే ఆయన చేరిక విషయంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టతనివ్వకపోతుండడాన్ని శ్రీహరిరావు వ్యూహాత్మకంగా మలుచుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఆయన మైండ్‌గేమ్‌తో బీఆర్‌ఎస్ పార్టీ నేతలను, ముఖ్యంగా ఐకే రెడ్డి అనుచరులను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. ఈ చేరికల కారణంగా బీఆర్‌ఎస్ పార్టీలోని మిగిలిన నేతలంతా నైరాశ్యానికి గురవుతుండగా కాంగ్రెస్ పార్టీలో మాత్రం కొత్త ఉత్సాహం నెలకొంటోందంటున్నారు.

ఐకేరెడ్డి చేరికపై తొలగని సందిగ్ధత

కాగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే వ్యవహారంపై ఇప్పటి వరకు సందిగ్ధత తొలగడం లేదంటున్నారు. ఆయన చేరిక విషయంలో అధిష్ఠానం స్పష్టతనివ్వకపోతుండడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఐకేరెడ్డి మాత్రం తానూ కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై నాలుగైదు రోజుల్లోనే స్పష్టమైన ప్రకటన చేస్తానంటూ కార్యకర్తలకు చెబుతున్నారు. ఇప్పటికే డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వర్గం అల్లోల చేరికను పకడ్బందీగా అడ్డుకుంటోంది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డికి సైతం ఫిర్యాదులు చేశారు. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఉన్నాయని దీని కారణంగా ఆయన పార్టీలో చేరితే నష్టం జరుగుతుందంటూ శ్రీహరిరావుతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సైతం వివరించారు. శ్రీహరిరావు వర్గం నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే విషయాన్ని ఆ పార్టీ అధిష్ఠానం జాప్యం చేస్తోందని అంటున్నారు. ఈ క్రమంలో ఐకె రెడ్డి చేరికపై స్పష్టత రాకపోతున్న కారణంగా ఆయన అనుచరులంతా ఒక్కొక్కరుగా జారుకుంటూ హస్తం గూటికి చేరుకుంటున్నారు.

వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న శ్రీహరిరావు

డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు చేరికల విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మొదట ఆయన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను పకడ్బందీగా అడ్డుకోగలిగారు. ఇప్పటి వరకు ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోకుండా శ్రీహరిరావు బ్రేకులు వేయగలిగారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఇంద్రకరణ్‌రెడ్డి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క ప్రయత్నం ఫలించడం లేదంటున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యులు కేశవరావు తదితరులతో ఐకేరెడ్డి ప్రయత్నాలు జరుపుతున్నట్లు సమాచారం. మాజీ మంత్రి జానారెడ్డితో కూడా కాంగ్రెస్‌లో చేరే అంశంపై ఇంద్రకరణ్‌రెడ్డి పెద్ద ఎత్తున ప్రచారం చేశారన్న ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ శ్రీహరిరావు అధిష్ఠానం స్థాయిలో ప్రయత్నాలు జరుపుతూ ఐకేరెడ్డి చేరికను ఇప్పటి వరకు నివారించగలిగారు. అయితే ఇటీవల జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేరికపై చేసిన వ్యాఖ్యలు చర్చకు తావిస్తున్నాయంటున్నారు. దీని కారణంగా ఐకేరెడ్డి మరో వారం రోజుల్లోగా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నాయన్న ప్రచారం కూడా మొదలైంది.

కాంగ్రెస్‌లో ఉత్సాహం

ఇదిలా ఉండగా ప్రస్తుతం చేరికల కారణంగా కాంగ్రెస్ పార్టీలో పూర్వ ఉత్సాహం నెలకొంటోంది. చాలా యేళ్ళ నుంచి కార్యకర్తలు లేక సరియైన నాయకత్వం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా డీలా పడిపోయింది. అప్పట్లో డీసీసీ అధ్యక్షునిగా వ్యవహరించిన మహేశ్వర్ రెడ్డి కొంత మేరకు జిల్లాలో కాంగ్రెస్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. ఆయన పార్టీని వీడిన నాటి నుంచి కాంగ్రెస్‌లో పూర్తిగా నిస్తేజం నిండుకుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కారణంగా కూడా పార్టీ కుంగిపోయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా ఇక్కడి రాజకీయ రూపు రేఖలే మారిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే బీఆర్‌ఎస్ పార్టీ బలహీనపడడం మొదలైంది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఒక్కో నేత కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం అలాగే డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పకడ్బందీగా వ్యూహరచనలు చేయడంతో పాటు బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండడం లాంటి పరిణామాలన్నీ కాంగ్రెస్‌పార్టీకి ఊపునిస్తున్నాయంటున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నేతలంతా వరుస కట్టి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ పూర్వవైభవం దిశగా అడుగులు వేయబోతోందని అంటున్నారు.

జీయర్ గురుకులంలో చదివిన

విద్యార్థులు ప్రపంచానికి మార్గదర్శకంగా మారాలి

- నిరుపేద విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకే జూనియర్ కళాశాల ఏర్పాటు
- రామాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు : త్రిదండి చిన జీయర్ స్వామి
- అల్లంపెల్లిలో శ్రీ సీతారామస్వామి ఆలయం, జూనియర్ కళాశాల ప్రారంభం
- కార్యక్రమానికి హాజరైన ఖానాపూర్, అశ్వరావుపేట, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు



సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చిన జీయర్ స్వామి

ఖానాపూర్, ఏప్రిల్ 19 : అల్లంపెల్లిలోని జీయర్ గురుకులంలో చదివిన విద్యార్థులు ప్రపంచానికే మార్గదర్శకంగా మారాలని ప్రముఖ పీఠాధిపతి త్రిదండి చిన జీయర్ స్వామి అన్నారు. శుక్రవారం కడెం మండలంలోని అల్లంపెల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీయర్ గురుకులంలో చదివిన నిరుపేద విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి నట్లు ఆయన పేర్కొన్నారు. రామాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ చినజీయర్‌స్వామి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన కార్య క్రమంలో సీతారామస్వామి ఆలయంతో పాటు గురుకులం ఆవరణలో జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు తీర్థ గోష్ఠి ప్రసాదాలను అందజేశారు. ట్రస్మా యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సబ్జెక్టులతో పాటు వ్యక్తిగత విలువలను నేర్పించాలని ట్రస్మా నాయకులను కోరారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



అల్లంపెల్లిలో చినజీయర్ స్వామి అనుగ్రహ భాషణం

పలువురు ప్రముఖుల హాజరు

అల్లంపెల్లిలో త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారామ స్వామి ఆలయ, జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ సహా పలువురు ప్రముఖులు హాజరై ఆలయంలో దర్శించుకున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.



చిన జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



గోదావరి నదిలో సీతారాముల తెప్పోత్సవం

వైభవంగా సీతారాముల తెప్పోత్సవం

- ఉత్తరవాహిని గోదావరి నదిలో సీతారాముల జలవిహారం

ఖానాపూర్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోని అతి పురాతన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి వేద పండితులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో భారీగా తరలివచ్చి ఆలయం నుండి పట్టణ శివారులోని ఉత్తర వాహిని గోదావరి నది తీరం వరకు సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నదిలో ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రోచ్చారణల మధ్య నది స్నానం చేయించి గోదావరిలో జల విహారం నిర్వహించారు. ఈ వేడుకతో ఉత్తర వాహిని గోదావరినది తీరం రామనామ స్మరణతో మార్మోగింది. ఆలయ కమిటీ బృందంతో పాటు స్థానిక నాయకులు, భక్తులు భారీగా తరలివచ్చారు.

శ్రీరామ ప్రతిమతో శోభాయాత్ర



నర్సాపూర్(జి), ఏప్రిల్ 19 : మండల కేంద్రం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. లోకేశ్వరం మండలం నుంచి తీసుకువచ్చిన శ్రీరాముడి ప్రతిమతో ఊరేగింపుగా డీజే పాటలతో హనుమాన్ మాల వేసిన స్వాములు వీధుల గుండా వెళ్లారు. గ్రామానికి చెందిన లక్ష్మిపతి స్వాములకు అన్నదానం చేశారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



కామోల్‌లో సీతారాముల కల్యాణం

భైంసా రూరల్, ఏప్రిల్ 19 : మండలంలోని కామోల్ గ్రామంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన స్వామివారి కళ్యాణం తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్య లో భక్తులు తరలివచ్చారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సిబ్బందితో వీసీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

బాసర, ఏప్రిల్, 19: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం సిబ్బందితో వైస్ చాన్సలర్ వెంకటరమణ సమావేశం నిర్వహించారు. స్టూడెంట్ మెంటరింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులను ఎలా మెంటరింగ్ చేయాలనే దానిపై పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు మార్గదర్శకత్వాన్ని మెరుగు పరిచేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి అకాడమిక్ సిబ్బందికి సూచించారు. తిరుమల రెడ్డి కార్పొరేట్ ట్రైనర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేకానంద

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి నిర్మల్, కొమురం భీం, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎఫ్‌ఎస్‌టీ, వీడియో వీవింగ్, స్టాటిస్టికల్ సర్వే లైన్ టీములు సమర్థవంతంగా వ్యవహరించాలన్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, ఇతర వస్తువులకు సంబంధించిన వివరాలు జిల్లాల వారీగా సమీక్షించారు. రిపోర్టులు సమయానికి పంపాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఒక కోటి 19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. 16,089 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడండి

- ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రశాంత్‌జీవన్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : గ్రామీణ ప్రాంతాల్లో వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సోన్ మండలం గంజాల్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, నీటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, అధికారులు పాల్గొన్నారు.

భైంసా - బాసర రహదారిపై వాహన తనిఖీలు

ముథోల్, ఏప్రిల్ 19 : మండల కేంద్రమైన ముథోల్‌లోని కంటి దవాఖాన సమీపాన భైంసా - బాసర రహదారిపై శుక్రవారం ముథోల్ ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేశారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే వదిలి పెడుతున్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

భైంసా రూరల్, ఏప్రిల్ 19 : మండలంలోని చింతల్‌బోరి గ్రామ శివారులో రంగారావు పల్సికర్ ప్రాజెక్టు సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యమైంది. సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు ఉండవచ్చని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారాన్ని ఇవ్వాలని పోలీసులు కోరారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం



నర్సాపూర్(జి), ఏప్రిల్ 19 : మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద శుక్రవారం సాయత్రం టాటాఏస్ వాహనం ముందర టైరు పేలడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం షేక్‌సాబ్ లొద్ది నుండి లోకేశ్వరం మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన కురుమ కులస్థులు మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణంలో నసీరాబాద్ వద్ద టాటాఏస్ వాహనం ముందు టైరు పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు కిందికి వాహనాన్ని దించడంతో ప్రమాదంలో వాహనం అద్దం పగిలి ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయి.

మీకు మేమున్నాం..

- ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పోలీసుల భరోసా



బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో భరోసా కార్యక్రమంలో ఎస్సై ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి జ్యోతిమణి

బాసర, ఏప్రిల్, 19 : అధైర్యపడకండి .. ఏ సమస్య ఉన్నా.. ఏ సమయంలోనైనా మాతో చెప్పండి మీకు అండగా మేముంటాం. అంటూ పోలీసులు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి అయినటువంటి సబ్ ఇన్స్‌పెక్టర్ జ్యోతిమణి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాను ట్రిపుల్ ఐటీలో చదువుకున్నప్పుడు ఎదురైనా సమస్యలను, సవాళ్లను ఎలా అధిగమించారో ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. ప్రతిచోట, ప్రతి రంగాల్లో ఒత్తిడి ఉంటుందని దాన్ని ఎలా అధిగమించాలో వివరించారు. సమస్య ఏది ఉన్నా పరిష్కరించుకోవచ్చుగాని ప్రాణంపోతే తిరిగి రాదని వివరించారు. మీకు ఎల్లప్పులు పోలీసులు అండగా ఉంటారని భరోసా కల్పించారు.

సంక్షిప్త సమాచారం

హోంగార్డ్‌పై కేసు నమోదు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : నిర్మల్ పట్టణ పోలీసుస్టేషన్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ షమీఉల్లాఖాన్‌పై మోసాలకు పాల్పడుతూ బెదిరిస్తున్నట్లు ఆరోపణలపై శుక్రవారం ఆయనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. సిమెంట్, ఇసుక, ఇటుక, ఇనుము తక్కువ ధరకు ఇప్పిస్తామని నమ్మించి ప్రజలను మోసం చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేసినందున కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, అతనిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేపు సీపీఐ (ఎం) బహిరంగ సభ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : సీపీఐ ఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ పట్టణంలో బహిరంగసభ నిర్వహిస్తుందని దాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం నిర్వ హించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర నాయకులు డీజీ నర్సింగరావు, జిల్లా ఇన్ చార్జి అడివయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. డి. నూతన్ కుమార్, పసియుద్దీన్, పోశెట్టి, సాయికిరణ్, చందు పాల్గొన్నారు.

ట్యూటర్లకు ఇన్విజిలేషన్ విధులు ఇవ్వాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : పదో తరగతి ఓపెన్ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు ట్యూటర్లకే కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా రాజేష్ నాయక్, క్రాంతి కుమార్ కోరారు. శుక్రవారం డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : దివ్య నగర్‌లోని ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని, అక్కడ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. శుక్రవారం డీసీసీ చీఫ్ కే.శ్రీహరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు బత్తుల రంజిత్, కొంతం గణేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి



రామగిరి నర్సయ్య (ఫైల్)

దస్తూరాబాద్, ఏప్రిల్ 19 : మండల కేంద్రానికి చెందిన రామగిరి లక్ష్మీనర్సయ్య(48) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన రామగిరి లక్ష్మీనర్సయ్య కూలీ పని చేసు కుంటూ జీవనం సాగించేవాడు. ప్రతీరోజు లాగానే కూలీ పనికి వెళ్లాడు. గత రెండు రోజుల నుండి నీరసంగా ఉండడంతో అతను పని చేస్తున్న చోటే కుప్పకూలిపోయాడు. దీంతో తోటివారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబికులు వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మార్గ మధ్యంలో మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'మోదీ పాలనకు పట్టం కట్టండి'

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : పదేళ్ల ప్రధాని మోదీ పాలనలో చేసిన అభివృద్ధికి మరోసారి పట్టం కట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మేడిసెమ్మె రాజు ప్రజలను కోరారు. శుక్రవారం బీజేపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా 24 వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

● గ్రామాల్లో మహిళా కాంగ్రెస్ నేతల ప్రచారం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ సోన్ మండలంలోని పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో శుక్రవారం మహిళా కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. భవాని ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వివరించారు. ఉపాధి కూలీకి 400ల రూపాయలు చెల్లించడం, ప్రతీ ఇంటికి ఒక మహిళకు లక్ష రూపాయలు చెల్లించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి వేణీ, వాసవి, లక్ష్మితో పాటు మండల నాయకులు రాజ నరసింహారెడ్డి, మధుకర్ రెడ్డి, గంగారెడ్డి, వంశీ పాల్గొన్నారు.

బీజేపీలోకి సత్యనారాయణ గౌడ్

● బీఆర్ఎస్‌కు నేడో రేపో గుడ్ బై



సత్యనారాయణ గౌడ్

నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభారాణి భర్త సత్యనారాయణ గౌడ్ బీజేపీలో చేరనున్నారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి నగేష్ సత్యనారాయణ గౌడ్‌తో గత వారం రోజుల నుంచి మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. సత్యనారాయణ గౌడ్‌కు నగేష్‌తో సన్నిహిత సంబంధాలున్న కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మల్ సెగ్మెంట్ బీఆర్ఎస్‌లో బలమైన నేతగా సత్యనారాయణ గౌడ్‌కు గుర్తింపు ఉంది. మూడు నాలుగు మండలాలలో ఆయనకు కొంతమేర పట్టు ఉంది. దీనికి తోడు బీసీ సామాజికవర్గంలో ఆయన సీనియర్ నేతగా కొనసాగుతున్నారు. మొదట్లో ఆయన తెలుగుదేశం తరపున నిర్మల్ ఎంపీపీగా, కాకతీయ పాలకవర్గ సభ్యుడిగా కూడా పని చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఆయనను సత్తెన్న అని పిలిచేంతగా సాన్నిహిత్యం ఉంది. బీఆర్ఎస్ ఆవిర్భావానికి ముందు తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై మాజీ సీఎం కేసీఆర్ ఇక్కడి పోచంపాడ్ ప్రాజెక్టు వద్ద సత్యనారాయణ గౌడ్‌తో సుదీర్ఘంగా చర్చలు కూడా జరిపారు. కాగా.. సత్యనారాయణ గౌడ్‌ను కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా ఇప్పటికే డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆహ్వానించారు. అయితే బీజేపీ లోక్‌సభ అభ్యర్థి నగేష్ ఒత్తిడి మేరకు ఆయన బీజేపీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఆయన కాషాయ కండువా కప్పుకోనున్నట్లు సన్నిహితులు తెలిపారు.

బీజేపీని ఓడించండి : ఏఐటీయూసీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాల పునరుద్ధరణకు వచ్చే నెల జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐటీయూసీ పిలుపునిచ్చింది. శుక్రవారం జిల్లా కార్యాలయంలో 138వ మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ మాట్లాడుతూ.. హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, బ్యాంకులను కుదించరాదని, 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. మే డేను విజయవంతం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్థులు

సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే బొజ్జు

తలమడుగు రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 22న జిల్లాకేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కోరారు.పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సాయి లింగి గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు చేవ పోచన్న, ఇతర యువజన సంఘాల సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదవుల కోసం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చెప్పే మాయమాటలకు నమ్మి ఎవరు మోసపోవద్దన్నారు. ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, జడ్పీ టీసీ గణేష్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి : ఆర్టీసీ ఆర్ఎం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: వేసవిలో ఎండలు మండుతున్న దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి దాతలు ముందుకు వచ్చి చల్లని నీటిని అందించడం అభినందనీయమని ఆర్టీసీ ఆర్ఎం సోలోమెన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ లయన్స్ క్లబ్ కింగ్స్ అండ్ కాటన్ సీటి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చల్లని నీటి ఫ్రిడ్జిను ఏర్పాటు చేశారు. ఆర్ఎం సోలోమెన్ ముఖ్య అతిథిగా హాజరై దాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు నీటిని అందించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేల లయన్స్‌క్లబ్ ఫ్రిడ్జిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతలు ఇలానే ముందుకు వచ్చి ఎండల నుంచి ప్రజలను రక్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.లయన్స్‌క్లబ్ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కల్పన, లయన్స్ సభ్యులు, తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

తాంసి, ఏప్రిల్ 19: పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జామిడి, బండలనాగపూర్, తదితర గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఆయన పర్యవేక్షించారు. పనులు ఏ మేరకు జరుగుతున్నాయో ప్రజలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఎక్కడైనా ఉందో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల కార్యదర్శులు వారివారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు పనులను ఆయన పరిశీలించారు.



నగదు వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

రూ.5లక్షల నగదు పట్టివేత

నేరడిగొండ, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నేరడిగొండ టోల్‌ప్లాజా వద్ద జరిపిన తనిఖీల్లో భాగంగా శుక్రవారం బొలెరో పికప్ వాహనంలో జాదవ్ పృథ్వీ, అంకత్, రవికుమార్‌లు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5లక్షల 17వేలను తరలిస్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాయి. అయితే ఈ పట్టుబడ్డ డబ్బులను ఫ్లయింగ్ స్క్వాడ్ మెజిస్ట్రేట్ బీర్రు భాస్కర్‌కు అప్పగించారు. పట్టుబడ్డ డబ్బులతో పాటు ఇరువురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నంత వరకు రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు వెంట తీసుకవెళ్లరాదని వారు పేర్కొన్నారు. ఎవరైనా అత్యవసరమనుకుంటే సంబంధిత ఆధారాలు వెంట ఉండాలన్నారు. ఈ దాడిలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది శంకర్, వామన్‌రావ్, విఠల్‌సింగ్, తదితరులున్నారు.



రేంజ్ అధికారితో మాట్లాడుతున్న చించోలి గ్రామస్థులు

పార్కులో నిప్పుపెట్టిన వారిపై ఫిర్యాదు

బోథ్, ఏప్రిల్ 19: మండలంలోని సరిహద్దుల్లో ఉన్న చించోలి గ్రామంలోని అర్బన్ పార్కులో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే అగ్ని ప్రమాద కారకులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు ఇద్దరు వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న వారితో కలిసి చించోలి గ్రామస్థులు కలిసి బూత్ రేంజ్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి ప్రణయ్‌ను నోటీసులు ఇచ్చిన విషయమై వివరణ కోరారు. అయితే రేంజ్ అధికారి మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గ్రామస్థులకు వివరించారు. గిరిజనులు కార్యాలయం వద్ద ఆందోళన చేసేందుకు ప్రయత్నించడంతో విషయం తెలుసుకున్న బోథ్ ఎస్సై బి.రాము రేంజ్ కార్యాలయానికి చేరుకున్నారు. వారిని సముదాయించి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న స్థలానికి వెళ్లారు. అగ్ని ప్రమాదం ఏ విధంగా జరిగిందో అన్న విషయమై పరిశీలించారు.

ఆదిలాబాద్ జిల్లా నిప్పుల కొలిమి

● జిల్లావ్యాప్తంగా దంచి కొడుతున్న ఎండలు ● అర్లి(టి)లో 43.8 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే మే మాసంలో ఎండలు మ రింత మెండుగానే ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 43.0 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 29.7 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో 43.6, మావల మండలంలో 42.9, గాదిగూడ మండలంలో 42.0, ఇచ్చోడ మండలంలో 41.6, తలమడుగులో 40.9 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండల తీవ్రత మరి ఎక్కువగా కనిపిస్తుంది.కేవలం బజార్‌హత్నూర్ మండలంలోనే 39.6 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలంతా తీవ్రమైన వడగాలులతో ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రి వేళల్లో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండతాపం నుంచి తట్టుకునేందుకు ప్రజలు ఏసీలు, కూలర్లను ఏర్పాటు చేసుకోవడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఉదయం 10గంటల తర్వాత బయటకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. అత్యవసరమైతే గొడుగు సహాయంతో బయటకు రావాల్సి వస్తుంది. ఎండ దెబ్బకు గిరాకీలు లేక చిరువ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు, ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం పనులు ముగించుకుని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్నారు.

● చిరు వ్యాపారులకు 'వేసవి' కష్టాలు!!

ఇచ్చోడ: రోజురోజుకు ఎండలు మండిపోవడంతో చిరువ్యాపారులు వేసవి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఎండలతో ఆరుబయట నిమిషం కూడా నిలబడే పరిస్థితి లేదు. సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అటు ప్రజలు ఇటు రోడ్డుపక్కన ఉండే చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల మీద బయటకొస్తేనే భయమేసే ఈ కాలంలో చిరువ్యాపారులు తమ పొట్టకూటి కోసం గొడుగుల సహాయంతో వారి చిరువ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఈ వేసవిలో ఎండలు మెండుగానే ఉన్నాయని, వచ్చే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని అంటున్నారు.



జిల్లాకేంద్రంలో ఎండతాపానికి స్కార్ఫ్ ధరించి వెళ్తున్న యువతులు







ఇచ్చోడ మండల కేంద్రంలో మండుటెండలో గొడుగు సహాయంతో చిరువ్యాపారుల అవస్థలు ఇలా..

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'

ఉట్నూర్, ఏప్రిల్ 19: కల్లబొల్లి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలను పూర్తిగా మభ్యపెడుతోందని, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. ఉట్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రైతులను మభ్యపెడుతూ మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతీనెల మహిళలకు ఇస్తామని ప్రకటించినా.. నగదు చెల్లింపులు అమలు చేయలేక పోయిందని విమర్శించారు. తమ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్లమెంట్ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. చచ్చేది లేదు అంటూ ప్రజలు అంటునే బీజేపీకి పట్టం కట్టపెడతామని బాహటంగా ప్రకటిస్తున్నారని అన్నారు. దేశానికి మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీని ఎన్నుకోవాలని ప్రజలు ఎంతో కుతూహలంతో ఉన్నారన్నారు. మూడు దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో స్థిరపడిన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ ఎలాంటి మచ్చ లేని నాయకుడు అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయకుడు మంత్రి వర్గంలో మంత్రిగా పని చేసిన అనుభవంతో పాటు ఆదిలాబాద్ ఎంపీగా కూడా ప్రజలకు సేవలు అందించినారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు నెలల క్రితం అధికారం కోల్పోయిన వెంటనే ఆ పార్టీ నాయకులు ఇతర పార్టీల్లో చేరి పోవడంతో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దాహంతో అనేక అడ్డదారులు తొక్కిందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, సీపతిలింగ గౌడ్, బొడ్డు కిరణ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

● ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆదిలాబాద్ అర్బన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డు నెం.3 పరిధిలో గల బెల్లూరిలో విఠలేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. బెల్లూరి గ్రామస్థులు కలిసి ఆలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, ముకుంద్, రాజు, శివ, గ్రామస్థులు అరవింద్, సాయి, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల వినతిపత్రం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘ నాయకులు ఏఐటీయూసీ పిలుపు మేరకు శుక్రవారం ఇన్‌చార్జి సీడీపీవోకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, రిటైర్మెంట్ జీవో రద్దు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు ఎస్. విలాస్, కే. శ్రీనివాస చారి, పద్మ, దయసాగరి, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

సారంగాపూర్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలో గల రాజీవ్ కాటన్ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం కౌట్ల సొసైటీ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధర, క్వింటాల్‌కు రూ. 3,180లు ప్రకటించిందని తెలిపారు. రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు దూరం

భైంసా, ఏప్రిల్ 19 : సినిమా థియేటర్లు,ఆసుపత్రుల నిర్వాహణ సిబ్బంది అన్ని వేళల జాగ్రత్త చర్యలు పాటిస్తూ అప్రమత్తతతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదని భైంసా ఫైర్ ఆఫీసర్ సింగన్న పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఆసుపత్రులు, సినిమా థియేటర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఇందులో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతను హడలెత్తించిన వాతావరణం

● నిర్మల్ జిల్లాలో అకాలవర్షంతో వరి రైతుల్లో ఆందోళన ● కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యం ● త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్న రైతులు





ఖానాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం సాయంత్రం జిల్లాలోని పలుచోట్ల ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలి దుమారంతో కూడిన వర్షం కురిసింది. దీంతో అన్నదాత హడలెత్తిపోయాడు. వరి పంట చివరి దశకు చేరుతున్న క్రమంలో వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే జిల్లాలోని పలు మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఈ దశలో వాతావరణం బెంబేలెత్తిస్తుండడంతో చేతికి అందిన పంట ఎక్కడ నీటి పాలవుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వేగంగా కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసి కొనుగోలు కేంద్రాలను ఇదివరకే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఖానాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి గత రెండు రోజులుగా ధాన్యం భారీగా వస్తోంది. ఇప్పటివరకు గత రెండు రోజుల నుండి సుమారు 25 ట్రాక్టర్ల వరకు ధాన్యం వచ్చిందని, కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండేందుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేరని రైతులు చెబుతున్నారు. తామే ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉంటున్నప్పటికీ కొనుగోలు కేంద్రంలో లైట్లు కూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నందున వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. వరి కోతలు పూర్తయిన రైతుల ఆందోళన ఇలా ఉంటే ఇంకా కోతలు చేపట్టని రైతుల ఆందోళన మరోలా ఉంది. చివరి దశకు చేరుకోవడంతో భూమిని ఆరబెట్టేందుకు రైతులు వరి పొలానికి పలుచోట్ల నీటిని నలిపి వేశారు. ఈ దశలో వర్షం పడితే పొలం తడిసిపోయి మరో వారం పది రోజుల వరకు హార్వెస్టర్ యంత్రం నడిచేందుకు వీలు లేకుండా తయారవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి వాతావరణంలో వస్తున్న మార్పులు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



ఖానాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆకుల రాజేశ్వర్, రైతు, తర్లపాడ్

ఖానాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చాను. ఇక్కడ వాచ్‌మెన్ గాని, నీటి సౌకర్యం గాని లేవు. ధాన్యం కుప్పల వద్ద రాత్రివేళ కాపలా పడుకుంటున్నాం. ఇక్కడ కనీసం లైట్లు కూడా అందుబాటులో లేవు. వెంటనే కొనుగోలు కేంద్రంలో వెలుతురు, త్రాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి కొనుగోళ్లను త్వరగా ప్రారంభిస్తే బాగుంటుంది.



ఆకుల రాజేశ్వర్, రైతు, తర్లపాడ్

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయండి

● ప్రజలకు నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పిలుపు
● కాంగ్రెస్‌లో చేరిన దిలావర్‌పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు



శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 19 : దేశంకోసం గాంధీకుటుంబం సర్వం త్యాగం చేసిందని, ఆ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. దిలావర్‌పూర్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రస్తుత దిలావర్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ అక్కర అనిల్‌కుమార్, మండల రైతు బంధు కోఆర్డినేటర్ కే.రాజేశ్వర్, వైస్ ఎంపీపీ బాపురావు, కదిలి దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు స్వామి గౌడ్, ఆర్.మహేష్, తిరుమల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అమృత చిన్నారెడ్డి, న్యూ లోలం సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ, దిలావర్‌పూర్ గ్రామ అధ్యక్షులు రవి, భుజంగరావు, కదిలి ఉప సర్పంచ్ మారుతి పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ దత్తురాం పటేల్, సంభాజీ పటేల్, నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ ఏ. లక్ష్మణ్, పెద్ద ఎత్తున ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసి శుక్రవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సమక్షంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని కనీసంగా 15 సీట్లలో గెలిపించి.. రాహుల్ ప్రధాని కావడానికి సహకరించాలని కోరారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ధరల నియంత్రణ ఉంటుందని తెలిపారు. మోదీ ప్రధాని కాకముందు రూ. 25 వేలు ఉన్న తులం బంగారం ధర ఇప్పుడు రూ. 85 వేలకు పెరిగిందన్నారు. ప్రస్తుతం బంగారం కొనే పరిస్థితి ఉందా...? అని ప్రశ్నించారు. గ్యాస్ సిలిండర్ ధరను పెంచి ఎన్నికలు రాగానే వంద రూపాయలు తగ్గించారని విమర్శించారు. మోదీపాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని, కేవలం కార్పొరేట్ కంపెనీలకు లాభం చేశారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఎప్పుడో బొంద పెట్టారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మాయ మాటలను ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదని, అటు రాష్ట్రంలో ఇటు నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పనైపోయిందన్నారు. ఉమ్మడి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 22న పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ మండల పార్టీ అధ్యక్షులు తక్కల సాగర్ రెడ్డి, అరుగుల రమణ, నర్సాపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఇంద్రకరణ్ రెడ్డి, మహేందర్, శ్రీహరి, రాంపూర్ తాజా మాజీ సర్పంచ్ గోవింద్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



● ఇప్పటికీ తడకల గుడిసెలోనే నివసిస్తున్న అమరవీరుల కుటుంబం

- 43 ఏళ్ల క్రితం కొమురంభీం స్ఫూర్తితో ఆదివాసీ గిరిజన రైతుల ఉద్యమబాట
- 'మావ నాటే- మావ రాజ్యం' నినాదంతో ఆదివాసీల పోరాటాలు
- 1981లో పోలీసులు కాల్పులతో తుపాకీ గుండ్ల వర్షం
- నేలకొరిగిన ఆదివాసీ గిరిజన రైతులు
- ఏప్రిల్ 20 అంటేనే గూడాల్లో ఉలిక్కిపాటు
- ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే
- అమరుల స్మృతి వనం నిర్మాణ పనుల్లో కదలిక కరువు
- ఇంద్రవెల్లి పరిసర ప్రాంతాలపై పోలీసుల నిఘా
- నేడు ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం





ఇంద్రవెల్లి.. పిలుస్తోంది!


ఆదిలాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భూమి కోసం.. భుక్తి కోసం.. స్వేచ్ఛా సమానత్వం కోసం.. స్వయం పాలన, వడ్డీ వ్యాపారులు, అటవీ అధికారులు, జమీందారుల పెత్తనం నశించాలంటూ సరిగ్గా 43 ఏళ్ల క్రితం 'మావ నాటే- మావ రాజ్యం' (మా ఊరిలో.. మా రాజ్యం) అనే నినాదంతో ఆదివాసీ గిరిజనుల ముద్దు బిడ్డ కొమురంభీం పోరాటాల స్ఫూర్తితో ఎందరో మంది ఆదివాసీ రైతు బిడ్డలు ఉద్యమబాట పట్టారు. 1981 ఏప్రిల్ 20న పోలీసులు కాల్పులతో అమాయక గిరిజన రైతులపై తుపాకి గుండ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనలో వందలాది మంది తుపాకీ తూటలకు నేలకొరుగగా మరెందరో మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో ఏప్రిల్ 20 అంటేనే ఆదివాసీ గూడాలు ఉలిక్కి పడుతున్నాయి. ఆనాటి భయంకరమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భయం భయంగా బ్రతుకులు వెళ్లదీస్తున్నారు. అప్పట్లో ఈ సంఘటన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దుమారం రేపింది. హక్కుల కోసం ఉద్యమించిన ఆదివాసీ రైతులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దాక్షణంగా అణిచి వేసేందుకే ఈ మారణకాండకు పాల్పడినట్లు తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆనాటి ఘటనలో 13మంది గిరిజన రైతులు మాత్రమే మృతి చెందారని ప్రభుత్వం పేర్కొనప్పటికీ.. వందలాది మంది గిరిజనులు ప్రాణాలు విడిచి నేలకొరిగారని ప్రత్యక్షసాక్షులు ఇప్పటికీ చెబుతున్నారు. అమరవీరులకు నివాళులర్పించేందుకు ఆదివాసీ గూడాలు ఇంద్రవెల్లికి దండుకట్టి తరలుతున్నాయి. యేటా హిరాపూర్ గ్రామంలో ఏప్రిల్ 20న అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకోవడం ఆదివాసీలకు ఆనవాయితీగా వస్తుంది.

నిరంతర పోరాటాలు

పాలకులు, ప్రభుత్వాలు మారిన ఆదివాసీల తలరాతలు మాత్రం మారడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఆదివాసీల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్న అమలుకు నోచుకోవడం లేదు. 1/70 చట్టాన్ని తొక్కిపెట్టడంతో ఆదివాసీల ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికి అర్హులైన ఎందరో మంది పేద రైతుల కు పోడుభూములపై హక్కులు కల్పించడం లేదు. మారుమూల గిరిజన గ్రామాలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నాయి. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ, బోరుబావుల మీద ఆధారపడి దాహా న్ని తీర్చుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రతియేటా ఏజెన్సీలో దాహం కేకలు వినిపిస్తున్న పట్టించుకునే నాథుడే లేడంటూ ఆదివాసీలు వాపోతున్నారు. ఇప్పటికీ ఎన్నో మారుమూల గ్రామాలకు రోడ్డు మార్గం, విద్యుత్ సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు మరి. ప్రతియేటా సీజనల్ వ్యాధుల బారీన పడి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జీవో నెం.3 పునరుద్ధరించాలని డిమాండ్లు వస్తున్నా.. పట్టించుకోవడం లేదంటున్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలంటూ ఆదివాసీలు గత కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటానికి పరిష్కార మార్గం దొరికినట్టే కనిపిచండం లేదు. ఉన్నత విద్య, మెరుగైన వైద్యానికి ఆదివాసీలు దూరమవుతునే ఉన్నారు. ప్రభుత్వాలు పలు రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఆదివాసీల దరికి చేరడం లేదు. హక్కుల కోసం నిరంతరంగా పోరాటాలు చేస్తున్నా.. ప్రభుత్వాలు పరిష్కార మార్గం చూపడం లేదు.

ముందుకు సాగని పనులు

హక్కుల కోసం పోరాటం చేసి పోలీసు కాల్పుల్లో నేలకొరిగిన ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనాన్ని నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు వస్తున్నాయి. అయిన గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపన పోలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి ఘటనకు పశ్చాతాపం పడుతూ అమరవీరుల స్మృతి వనం నిర్మాణానికి ముందుకొచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజే ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతి వనం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోటి రూపాయల వ్యయంతో స్మృతి వనాన్ని నిర్మించేందుకు ఫిబ్రవరి 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. స్మృతి వనం నిర్మాణం పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. కాని రెండు మాసాలు గడుస్తున్నా.. పనుల్లో కదలిక మాత్రం కనిపించడం లేదు. ముఖ్యమంత్రి ప్రత్యేకదృష్టిని సారించిన ప్రయోజనం లేకుండానే పోయింది. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యంతో స్మృతివన నిర్మాణం ఆల స్యమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదట కొన్ని అభ్యంతరాలు వచ్చిన అందుబాటులో ఉన్న ఎకరం స్థలంలోనే స్మృతి వనాన్ని నిర్మించేందుకు సిద్ధమయ్యారు. అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలనే దానిపై స్పష్టత కనిపించడం లేదు. ఇంద్రవెల్లి చారిత్రక అనవాళ్లను భావితరాలకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టా లంటున్నారు. గత రెండు మాసాల క్రితం అమరవీరుల స్తూపాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమరవీరుల కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేశారు. 15 కుటుంబాలకు ఇంటి స్థలాలను అందజేశారు. అయితే పూర్తిస్థాయిలో న్యాయం జరుగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.



పోలీసుల కాల్పుల్లోనే నా భర్త చనిపోయాడు

: సిడ్మెక లచ్చుబాయి, తాటిగూడ గ్రామం, ఇంద్రవెల్లి మండలం



గత 43 ఏళ్ల క్రితం ఇంద్రవెల్లిలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నా భర్త చనిపోయాడు. ఆయన చివరి చూపునకు కూడా నోచుకోలేదు. మా కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని గత ప్రభుత్వాలు ఎన్నోసార్లు హామీలిచ్చాయి. కానీని ఏఒక్క హామీని నెరవేర్చలేదు. ఇప్పటికీ ఉండేందుకు ఇల్లు కూడా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి స్థలం ఇచ్చారు. ఇందిరమ్మ ఇంటిని కూడా నిర్మించి ఇస్తామని చెప్పారు. ఎప్పుడు ఇస్తారో? తెలియడం లేదు.

ఆదివాసీలకు పోరాటాలు చేయడం కొత్తేమీ కాదు

: పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్



హక్కుల కోసం పోరాటాలు చేయడం ఆదివాసీలకు కొత్తేమీ కాదు. కొట్లాడి హక్కులను సాధించుకుంటాం. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. ఆదివాసీల పరిస్థితులు మారడం లేదు. కనీస వసతులను కల్పించడంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. కొందరు రాజకీయ నాయకులు వారి సొంత ప్రయోజనాల కోసం ఆదివాసీలను వాడుకుంటున్నారు. అలాగే ఉద్యమ నాయకులను భయపెడుతూ కేసులు పెట్టిస్తున్నారు. తుడుందెబ్బ ఆదివాసీల పక్షాన ఉండి పోరాటాలు చేస్తుంది. కొందరు నేతలు అమరవీరులతో రాజకీయాలు చేస్తున్నారు. దీనిని ఆదివాసీల హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ చూస్తూ ఊరుకోదు. ఆదివాసీల పక్షాన ఉంటేనే ఆదరిస్తాం. ఆదివాసీల ముసుగులో అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదు.

సంక్షిప్త సమాచారం

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● ఈఈ భీమ్‌రావు

నేరడిగొండ, ఏప్రిల్ 19: నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ ఈఈ భీమ్‌రావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారాం సావర్గాం గ్రామాలలో కొనసాగుతున్న భవన నిర్మాణం పనులను పరిశీలించారు. ఐటీడీఏ నిధుల నుంచి నిర్మించబడ్డ గ్రామ పంచాయతీని సందర్శించారు. భవనాలను నిర్మించే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఈఈ భీమ్‌రావ్‌రాథోడ్ అన్నారు. ఆయన వెంట ఏఈ శేఖర్‌తో పాటు సావర్గాం మాజీ సర్పంచ్ కళ్యాణి మహేందర్, తదితరులున్నారు.

'బాలికలు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి'

ఇచ్చోడ, ఏప్రిల్ 19: హైదరాబాద్‌కు చెందిన ఐటీసీ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు ఇచ్చోడలోని శ్రీరాజరాజేశ్వర వొకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఎలక్ట్రిషన్, తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన బాలికలు అర్హులని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మర్సకోల ఏకగ్రీవం

ఉట్నూర్, ఏప్రిల్ 19: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మర్సకోల జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రామేశ్వర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు, జిల్లా బాధ్యులు వెడ్మ శ్యామ్‌రావు, ఎం ధర్మారావు, ఆత్రం బలిరాం, అనక గంగారాం, పి జ్యోతిరాం, కె.యాదవ్‌రావుతో పాటు వివిధ మండల బాధ్యులు పాల్గొన్నారు. అనంతరం ఉట్నూర్‌లోని ఆశ్రమ క్రీడా పాఠశాల, ఆశ్రమ బాలికల, బాలుర పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్కారం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యల గురించి తెలుసుకున్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల వ్యయ పరిశీలకుడు జాదావవార్ వివేకానంద ● పాల్గొన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు (ఇన్‌సెట్‌లో పాల్గొన్న ఇతర జిల్లా కలెక్టర్లు, అధికారులు)

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్ల అధికారులతో ఎన్నికల వ్యయ పరిశీలకులు జాదావవార్ వివేకానంద ఐఆర్ఎస్ జిల్లా కలెక్టర్ రాజార్షిషాతో కలిసి పెన్‌గంగా భవన్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చుల వివరాలు ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని అన్నారు. ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరపున ఖర్చు చేసే ప్రతీ పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని తెలిపారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికలలో చేసిన ప్రకటనలకు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు.ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారి దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్ పై దృష్టి సారించాలని సోషల్ మీడియాపై పటిష్ఠంగా నిఘా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ గౌస్‌ఆలం

జైనథ్ రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రానికి సరిహద్దున గల జైనథ్, ఆనంద్‌పూర్, బేల ఉపసానాల, భీంపూర్, తలమడుగుల వద్ద తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్టును ఎస్పీ గౌస్‌ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని ఆనంద్‌పూర్ చెక్‌పోస్టును తనిఖీ చేసి పలు సూచనల సలహాలను పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, డబ్బు, ఇతర వాటిని పూర్తిగా నిషేధించామని పేర్కొన్నారు. అంతేకాకుండా రూ.50వేలలకు మించి తీసుకునే నగదుకు ఆధారాలు ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ అంశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.శ్రీకాంత్, డిప్యూటీ కమాండెట్ స్వప్నిల్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం ఉన్నారు.



పిప్పర్‌వాడలో వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం



సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌తో మాట్లాడుతూ..



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

రెండవ రోజు ఒకే నామినేషన్

● ఆత్రం సుగుణ గెలవడం ఖాయం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఆదిలాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి రెండవ రోజు శుక్రవారం ఒకే నామినేషన్ దాఖలయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆదిలాబాద్, బోథ్ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, పార్టీ నాయకులు కరీం, శ్రీలేఖలతో కలిసి నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలవడం ఖాయమన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 15 ఎంపీ సీట్లను సాధించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.5న్యాయ సూత్రాలు, ఆరు గ్యారెంటీలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. జిల్లా చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా మహిళకు అవకాశం కల్పించిందన్నారు. అందులో ఆదివాసీ బిడ్డకు అవకాశం కల్పించడం ఎంతో అదృష్టమన్నారు. బీజేపీ మతం పేరుతో, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ అందరూ కలసిమెలిసి ఉండాలని, ఈ ప్రాంతాన్ని సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతుందన్నారు.

ఎమ్మెల్యే పాయలపై కోడ్ ఉల్లంఘన కేసు

ఆదిలాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌పై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసును ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీసులు నమోదు చేశారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని రాముడి చిత్రాలతో పాటు ఎమ్మెల్యే చిత్రం ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, అయితే వీటికి సంబంధంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వారు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేపై 188 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టుకార్డులతో సీఎం హామీలపై నిలదీత

బోథ్, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, హామీలు ఎప్పుడు నెరవేస్తారంటూ మండలంలోని పొచ్చెర గ్రామ రైతులు శుక్రవారం పోస్టు కార్డుల ద్వారా నిరసన వ్యక్తపరిచారు. దీనిలో భాగంగా వారు మాట్లాడుతూ ఎకరానికి రూ.15 వేలు, రైతు భరోసా కింద ఇస్తామని మాట తప్పారని రైతులు పేర్కొన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ, రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500, 'కల్యాణలక్ష్మి' కింద తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తూ పోస్టుకార్డు రాసి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, బుచ్చన్న, చిలుకూరి వెంకటరమణ, సుమేందర్‌రెడ్డి, రాజు వెంకటరమణారెడ్డి, బాపూరెడ్డి, నల్ల శ్రీనివాస్, పోతారెడ్డి, సుధామరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి పోస్టుకార్డులను వేస్తున్నట్లు తెలుపుతున్న పొచ్చెర గ్రామ రైతులు



తోషం తండాలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారి

మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనది

● జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత జీవన్ పాటిల్

గుడిహత్నూర్, ఏప్రిల్ 19 : 'మిషన్ భగీరథ' నీరు స్వచ్ఛమైనదని ప్రతీ ఒక్కరు తమ అవసరాలకు వాడుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని డోంగర్గావ్, తోషం తాండ గ్రామాల ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను తాగునీటి సరఫరా గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో అపోహలతో ప్రజలు మిషన్ భగీరథ నీటిని తాగడం లేదని తమ దృష్టికి వచ్చిందని, మిషన్ భగీరథ నీటిని అందరూ తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు సరఫరా కాని గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సత్వరమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ బోర్వెల్స్ ద్వారా నీటి సరఫరా అవుతున్న గ్రామాల్లో మే రెండవ వారం వరకు అడుగంటిపోయే బోర్లను గుర్తించి తదనుగుణంగా వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం ద్వారా గాని తాగునీటి సరఫరా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశిం చారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్, ఈఈ చంద్రమోహన్, నీటిపారుదల ఎస్ఈఈ విఠల్, డీఎల్‌పీవోలు ఫణీందర్, ప్రభాకర్, తదితరులున్నారు.